వంతెనలు లేక ఇబ్బందులు

- అవస్థలు పడుతున్న చెర్లోపల్లి, గంటవానిపల్లె వాసులు
- తీగలేరు పొంగితే పలు ప్రాంతాలకు రాక పోకలు బంద్
- గతంలో దొంగలవాగు పొంగి ఓ యువకుడు గల్లంతు



తీగలేరు పొంగడంతో ఒడ్డునే నిలిచిన గంటవానిపల్లె వాసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాలకు వంతెనలు లేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమయంలో పలు గ్రామాలకు రాక పోకలు నిలిచి పోవటంతో పాటు మరికొన్ని ముఖ్య ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిధిలోని తీగలేరు పొంగి ప్రవహించడంతో ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె గ్రామాలకు వెళ్లే మార్గం లేక గ్రామస్తులు అగచాట్లు పడుతున్నారు. గతంలో ఆయా వంతెనల స్థానంలో అధునాతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించినా నేటికీ ఆయా వంతెనల పనులు ప్రారంభానికి నోచుకోకపోవం శోచనీయం. ఏటా వర్షాకాల సమయంలో మండల పరిధిలోని తీగలేరు వాగు పొంగి ప్రవహిస్తుండటంతో మండల పరిధిలోని చిన్నదోర్నాల కల్వర్టు వద్ద వరద వస్తుంది. అప్పుడు ఆ మార్గంలో మార్కాపురం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతితో పాటు గిద్దలూరు, కడప, పోరుమామిళ్ల తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో బస్సులు ఆ మార్గంలో కాకుండా కుంట మీదుగా చట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతేడాది తీగలేరు వాగు పొంగి ప్రవహించడంతో మూడు రోజుల పాటు గంటవానిపల్లె, ఎగువ చెర్లోపల్లి గ్రామాలకు రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరద తీవ్రతకు చిన్నదోర్నాల వద్ద కల్వర్టు, గంటవానిపల్లె చప్టాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయా ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. దీంతో అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారే తప్ప శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారు. దీంతో పాటు కర్నూల్ రోడ్డులో ఉన్న దొంగలవాగు పొంగి ప్రవహించటంతో కొత్తూరు వద్ద వెలుగొండ సొరంగ నిర్మాణ ప్రాంతంలో కర్నూల్ రోడ్డుపై ఉన్న నేల బారు చప్టాపై ఎన్నో మార్లు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు గతంలో ఎగువ చర్లోపల్లికి చెందిన ఓ యువకుడు వరద తీవ్రతకు గల్లంతై ప్రాణాలు కోల్పోయాడు. ఎన్నో ఏళ్లుగా వాగులు పొంగుతున్నా పట్టించుకున్న నాథుడే లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేల బారు చప్టాల స్థానంలో వంతెనలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం ఆర్చకుడు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. తొలుత అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నేడు బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభ



పుల్లలచెరువు: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్ద దోర్నాలలో ఆదివారం జరిగే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీశైలం రహదారిలోని మల్లికార్జున ఎస్టేట్స్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం నియోజకవర్గ శాసన సభ్యుడు తాడిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు భారీగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

6న పుల్లలచెరువులో..

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో ఈ నెల 6వ తేదీన జరిగే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, రమణరెడ్డి, యోహాను, రాష్ట్ర పంచాయతీరాజ్ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకి రఘు, నాయకులు కోటిరెడ్డి, దినేష్ యాదవ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఖాశిం, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఆనందరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

దొనకొండ: ద్విచక్ర వాహనాన్ని పందులు ఢీకొనటంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం దొనకొండ ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదుట శనివారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. దొనకొండకు చెందిన సీతిరాల రామయ్య కుమార్తె రుచిత దర్శిలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతోంది. రోజూ దొనకొండ నుంచి కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుంది. ఆ క్రమంలో స్నేహితురాలు పైనికను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని దర్శి నుంచి దొనకొండ వస్తున్నారు. పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి పందులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాయి. రుచిత, పైనికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు.

ఖరీఫ్ సాగులో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

దర్శి: ఖరీఫ్ సాగులో రైతులు మెళకువలు పాటించాలని సేద్యపు విభాగం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రస్తుత ఖరీఫ్ సాగులో సరైన సాగు మెళకువలు పాటిస్తూ ఖర్చులు తగ్గించుకుంటూ వ్యవసాయం చేయాలన్నారు. అందరూ ఒకే పంటను సాగు చేస్తే పంటల కొనుగోలు దశలో సరైన గిట్టుబాటు ధర లభించదని చెప్పారు. రైతులు అన్నీ రకాల పంటలు సాగు చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి. మానస మాట్లాడుతూ నరేంద్రమోదీ ఉత్తర ప్రదేశ్లోని వారణాసి వేదిక ద్వారా మాట్లాడుతున్న హిందీ సారాంశాన్ని తెలుగులోకి అనువదించారు.

ప్రజా సమస్యలపై స్పందించండి



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ ఆళ్ల

త్రిపురాంతకం: అధికారులు ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించాలని ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల ఆంజనేయరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. భూ సమస్యలు కోకొల్లలుగా ఉంటున్నాయని, రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వారికి పనులు జరగడం లేదని ఆళ్ల మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ సక్రమంగా అందించడం లేదని, గోడౌన్ నుంచే సరకు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్యాధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కౌలు రైతు కార్డులు అర్హులకు అందించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా గ్రామాల్లో సక్రమంగా నీరు సరఫరా జరగడం లేదన్నారు. ఉపాధి పథకం అధికారి సుజాత గైర్హాజర్ కావడంపై సభ్యులు ధ్వజమెత్తారు. అమె వచ్చే వరకు సభ జరగాలని పట్టుపట్టారు. ఆమె వస్తున్నానంటూ చివరకు సమావేశానికి రాలేదు. ఉపాధి పథకంలో భారీగా అవకతవకలు జరిగాయన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీడీఓ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ ఎంపీడీఓ మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఏఈ సుబ్బయ్య, వైద్యాధికారులు భాస్కరరెడ్డి, బ్రహ్మతేజ, రవినాయక్, ఎంఈఓలు మల్లికార్జున నాయక్, రాజశేఖరరెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన గురవయ్య

దొనకొండ: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన చెన్నుబోయిన గురవయ్య బజారుకు వచ్చి పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. దొనకొండ నుంచి కుంట వైపు ఓ లారీ ఇసుక లోడుతో వెళ్తోంది. స్పీడు బ్రేకర్ వద్ద లారీ డోర్ ఊడి గురవయ్యకు బలంగా తగిలింది. లారీ వెనుక టైర్ల కింద గురవయ్య రెండు కాళ్లూ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వచ్చి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుబ్బమ్మ

పుల్లలచెరువు: తల్లిపాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నారులకు, తల్లులకు పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టిస్తే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువ పాళ్లలో ఉంటుందని తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం పంపిణీ వివరాలు పరిశీలించారు. కార్యకర్తలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై, అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో తల్లులతో ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు ముండ్ల ప్రసన్న, జయమ్మ, కాశమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

యర్రగొండపాలెం:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యర్రగొండపాలెం, పెద్దదోర్నాల మండలాల కమిటీల్లో పలువురికి పదవులు కేటాయిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. యర్రగొండపాలెం మండల వైస్ ప్రెసిడెంట్స్‌గా దోగిపర్తి సంతోష్‌కుమార్, కామిశెట్టి వెంకట నరసయ్య, జనరల్ సెక్రటరీలుగా కందుల సత్యనారాయణ, పోలేబోయిన ఎల్లయ్య, గోరంట్ల కనకారావు, మండ్ల వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా పాత్లావత్ మంత్రూ నాయక్, మూల వెంకటేశ్వరరెడ్డి, తూమాటి చెన్నకేశవులు, కన్నెబోయిన పాపారాయుడు, మునుగంటి సుబ్రమణ్యం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దారా అయ్యన్న, కందుల తిరుమలేసు, వెన్నా బాలయోగిరెడ్డి, పత్తి ఆత్మరాములు, మొగుళూరి పెద్ద వెంకటేశ్వర్లు, పూజల శ్రీను, చిట్యాల బ్రహ్మరెడ్డి, మండ్ల ఇస్సాక్, కొక్కెర రాజయ్య, వడితె బాలునాయక్, ఆవుల శ్రీనివాసరెడ్డి, గాజుల వెంకటనారాయణ, ఉంగరి కొండలు, సన్నెపోగు పెద్దనాగయ్య, మండ్ల లక్ష్మయ్య, గాయం శివారెడ్డి, గోసుల వెంకయ్య, కంగటి పుల్లారెడ్డి, ఉర్రి బాదరయ్య, మంద జాన్, ఎనిబెర అమోస్, దేశావత్ హనుమానాయక్‌ను నియమించారు.

పెద్దదోర్నాల మండలంలో..

పెద్దదోర్నాల మండల వైస్ ప్రెసిడెంట్‌గా వల్లభనేని మల్లికార్జున, జనరల్ సెక్రటరీలుగా చల్లా సుబ్బారావు, దర్శనం నాగయ్య, మండ్లా రమణ, పొందుగుల వెంకటరెడ్డి, సెక్రటరీలుగా రావికింది సుబ్బారావు, దర్శనం వెంకటయ్య, షేక్ షరీఫ్, దూమావత్ మల్లికార్జున నాయక్, మండ్లా వెంకటేశ్వరు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పూర్ణగంటి బాబూరావు, సంద్రూ హనుమంతు, నాగుల ఎర్రయ్య, యలకపాటి అంకాలయ్య, సింగా వెంకటయ్య, సింగా నాగేశ్వరరావు, టప్పెట్ల వెంకటేశ్వర్లు, ఒంటేరు శ్రీనివాసులు, యలకపాటి రాజయ్య, దూదేకుల నాసరయ్య, పిన్నిక వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, వినుకొండ ఏసులు, గాయం పేరిరెడ్డి, బానావత్ బాలకాశి నాయక్, భూమని వెంకటయ్య, యాలురి పెద్దసుబ్బయ్య, పులుకూరి కోటయ్య, ధామం శేషయ్య, దండా ముసలారెడ్డి, చల్లా వీరనారాయణ, జినేపల్లి వెంకటేశ్వర్లును ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.దునుమణి తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హిందీ సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాసై ఉండాలన్నారు. ఈ నెల 6వ తేదీన కళాశాలలో డెమోకు బయోడేటాతో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.



